


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
మన దునియా
ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 4 | సంచిక : 5 | సెప్టెంబర్ 11 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-




# మన దునియా కథనానికి స్పందన..!






- గురుకుల బాలుర హాస్టల్‌లో అక్రమాలపై విచారణ చేపడతారా.. లేదా?
- కట్టెల పొయ్యిపై వంట చేసిన వారిపై చర్యలేవి?
- మెమోలు ఇచ్చి చేతులు దులుపుకుంటారా?
- పిల్లలకు అందాల్సిన గుడ్డు.. మటన్ ఏమైంది?
- నోటికాడి ముద్ద లాక్కొని తినేది ఎవరు?

**మన దునియా ములుగు జిల్లా మల్లంపల్లి సెప్టెంబర్ 10**

ఎటునాగారం--మల్లంపల్లి గురుకుల బాలుర హాస్టల్‌లో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న అవకతవకలపై మన దునియా వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించినట్లు తెలుస్తోంది. అయితే అసలు అక్రమాలపై సమగ్ర విచారణ ఎప్పుడు? బాధ్యులపై చర్యలు ఎప్పుడు? అన్న ప్రశ్నలు ఇప్పుడు హాస్టల్ వర్గాల్లో, విద్యార్థుల తల్లిదండ్రుల్లో వినిపిస్తున్నాయి. హాస్టల్‌లో కట్టెల పొయ్యిపై వంట చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటికీ, అందుకు బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కేవలం మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారా? లేక నిబంధనల ఉల్లంఘనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా? అనేది అధికారులే స్పష్టం చేయాల్సి ఉంది. పిల్లల మెనూలోని గుడ్డు ఏమైంది?

(మిగతా 2వ పేజీలో..)

## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

- సచివాలయంలో రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఉద్యోగి
- సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు
- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి ఏసీబీ అధికారులు
- సచివాలయ దేవాలయం వద్ద డబ్బులు తీసుకుంటుండగా పట్టివేత
- లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు

తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

(మిగతా 2వ పేజీలో..)



## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు

(మిగతా 2వ పేజీలో..)



## చాకలి ఐలమ్మ తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకం: సీఎం రేవంత్ రెడ్డి!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 10**

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం,గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతి రేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని వర్ధంతి సందర్భంగా ము ఖ్యమంత్రి రేవ ంత్ రెడ్డి



(మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

- తమిళగ వెట్రి కళగంకు రాష్ట్ర పార్టీ హోదా కల్పించిన ఈసీ
- విజయ్ పార్టీకి శాశ్వత గుర్తుగా 'విజిల్' కేటాయింపు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలిచిన టీవీకే
- తొలి ఎన్నికల్లోనే 34.92 శాతం ఓట్లు సాధించిన పార్టీ
- తమిళనాడులో ఏడో రాష్ట్ర పార్టీగా అవతరించిన టీవీకే

ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## చాకలి ఐలమ్మ తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకం: సీఎం రేవంత్ రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. భూస్వామ్య దోపిడీకి, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి, పేదలు, బలహీన వర్గాల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందని పేర్కొ న్నారు. సామాజిక న్యాయం, సమాన త్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదా యకమని ఆయన కొనియాడారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే సంకల్పం, సమాజ శ్రేయస్సు కోసం నిలబడే నిబద్ధత మనందరిలో ఉండా లని చాకలి ఐలమ్మ, జీవితం మనకు చాటి చెబుతోందని ముఖ్య మంత్రి పేర్కొన్నారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది: భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు.ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి

(మొదటి పేజీ తరువాయి)

రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు.సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

# మన దునియా కథనానికి స్పందన..!

(మొదటి పేజీ తరువాయి)

పిల్లలకు అందించాల్సిన మెనూ ప్రకారం గుడ్లు సక్రమంగా అందుతోందా? ప్రతిరోజూ పిల్లలకు చేరాల్సిన గుడ్ల సరఫరా, వినియోగంపై అధికారులు లెక్కలు పరిశీలించారా? గుడ్లు అందకపోతే అది ఎక్కడికి వెళ్తోంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వారానికి రెండుసార్లు ఇవ్వాల్సిన మటన్ ఎక్కడ?

పిల్లలకు వారానికి రెండుసార్లు అందించాల్సిన మటన్ వాస్తవంగా మెనూ ప్రకారం అందుతోందా? మెనూలో ఉన్న ఆహారం పిల్లలకు అందకుండా పోతే దానికి బాధ్యులు ఎవరు? సరఫరా రికార్డులు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, వంటశాల రికార్డులను ఉన్నతాధికారులు పరిశీలించారా? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.

నోటికాడి ముద్ద లాక్కొని తినేది ఎవరు?

పిల్లల కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న ఆహారం వారికి పూర్తిస్థాయిలో అందాల్సిందే. పిల్లల నోటికాడి ముద్దను లాక్కొని తినేది ఎవరు? అన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేవలం మెమోలు, హెచ్చరికలతో వ్యవహారాన్ని ముగించకుండా.. కట్టెల పొయ్యిపై వంట నుంచి మెనూ అమలు, ఆహార సరఫరా, నాణ్యత, బిల్లులు, స్టాక్ వరకు ప్రతి అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అక్రమాలు నిజమైతే బాధ్యులపై చర్యలు ఎప్పుడు?

మెమోలతోనే ఫైల్ మూసేస్తారా?

పిల్లలకు అందాల్సిన గుడ్లు, మటన్ లెక్కలు తేలుస్తారా?

# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

- ఏఐ టెక్నాలజీతో ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోల సృష్టి
- కొన్ని పథకాలలో పెట్టుబడులు పెట్టాలంటూ మోసపూరిత ప్రచారం
- ఇవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేసిన ఆమె కార్యాలయం
- వీటిని నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు హెచ్చరిక
- అనుమానాస్పద పోస్టులను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది.కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

## గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు
- మోదీ-జిన్‌పింగ్ ద్వైపాక్షిక భేటీకి అవకాశం
- 2020 గల్వాన్ తర్వాత ఇదే తొలి ముఖాముఖి చర్చ
- అజిత్ దోవల్ ఇటీవల చైనాలో చర్చలు
- సరిహద్దు, వాణిజ్యం, భద్రతపై చర్చకు అవకాశం

ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్-చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది.జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్తాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్‌ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ-జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
సెప్టెంబర్ । శుక్రవారం । 11 । 2026



# మూఢనమ్మకంతో మహిళ హత్య.. ఇద్దరు నిందితుల అరెస్ట్

**మన దునియా దండేపల్లి, సెప్టెంబర్ 10:**

మంత్రాలు చేస్తున్నారనే మూఢనమ్మకంతో మహిళను గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను దండేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టు వివరాలను మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాశ్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తితో కలిసి వెల్లడించారు.దండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42)ను ఈ నెల 8న రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో హత్య చేశారు. సింగతి రమేష్ (40), అతని తల్లి సింగతి రాంబాయి (55) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తమ అనారోగ్యానికి లక్ష్మి మంత్రాలు చేయడమే కారణమని వారు అపోహకు గురయ్యారు. ఆమెను హత్య చేస్తే తమ ఆరోగ్యం మెరుగుపడుతుందని మూఢనమ్మకంతో భావించి పథకం ప్రకారం హత్యకు పాల్పడ్డారు.లక్ష్మి భర్త ఇంట్లో లేని సమయంలో రాంబాయి ఇంటి బయట కాపలాగా ఉండగా, రమేష్ గొడ్డలితో ఇంట్లోకి ప్రవేశించి లక్ష్మి మెడపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు.నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు గూడెం దేవాలయం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గొడ్డలి, సెల్‌ఫోన్, గ్లామర్ మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఉత్తర్వులతో, ఏసీపీ ఆర్.



ప్రకాశ్ పర్యవేక్షణలో లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్, దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్, లక్షెట్టిపేట ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితులను అరెస్టు చేశాయి.నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్, డీసీపీ అభినందించారు.

**మూఢనమ్మకాలతో హింసకు పాల్పడితే కఠిన చర్యలు**

మూఢనమ్మకాల పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హత్యలు, దాడులు లేదా ఇతర నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఆర్. ప్రకాశ్ హెచ్చరించారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మకుండా అనారోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించాలని, సమస్యలు ఎదురైనప్పుడు చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి.

**మన దునియా, సెప్టెంబర్ 10,మంచిర్యాల జిల్లా**

ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలి. కేకే ఓ సి మేనేజర్ మధుసూదన్. సమస్త అభివృద్ధి నీ దృష్టిలో పెట్టుకొని ప్రతి ఉద్యోగి అధికారి అనే తేడా లేకుండా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని కేకే ఓ సి మేనేజర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కేకే ఓసీ ఉద్యోగులు అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రక్షణ సూత్రాలను పాటించకపోవడం విధులు నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్లనే ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. విధులలో చిన్న చిన్న పొరపాట్లే ప్రమాదాలకు కారణం అవుతాయని తెలిపారు. పని స్థలాలలో పక్క పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. కేకే ఓ సి లో అధికారులు ఉద్యోగులు అనే తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేస్తే సత్ఫలితాలు సాధిస్తాం అన్నారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి ఓసికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం కంటే అదనపు ఉత్పత్తిని సాధించి సింగరేణిలోనే సరికొత్త రికార్డు నెలకొల్పాలన్నారు. ఇతర ఓసీల ఉద్యోగులకు కేకే ఓసి ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా బొగ్గు నాణ్యత ప్రమాణాలను తప్పక పాటించాలని అప్పుడే మార్కెట్లో మన బొగ్గుకు మంచి రేటు లభిస్తుందని తెలిపారు. ఓసీలలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని నా




దృష్టికి తీసుకురావాలని అవి నా పరిధిలో అయితే వెంటనే పరిష్కరిస్తానని కానట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతానని చెప్పారు. ప్రతి ఒక్కరు సమస్త మనది అనే భావనతోనే పనిచేస్తే అభివృద్ధిలో అగ్రగామిగా ఉంటామ నే విషయాన్ని విస్మరించవద్దన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో మేనేజర్ కు పుష్పగుచ్చం అందజేసి సాల్వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్నకొండ ఆంజనేయులు, ఫిట్ కార్యదర్శి నూనె సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహ పూరితంగా ప్రారంభమైన ఏరియా అంతర్ విభాగీయ 62 వ వార్షిక క్రీడా పోటీలు.

**మన దునియా, సెప్టెంబర్ 10,మంచిర్యాల జిల్లా**

సింగరేణి హైస్కూల్ మైదానంలో మందమర్రి ఏరియా అంతర్ విభాగీయ 62 వ వార్షిక క్రీడా పోటీలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ (జిఎం) ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. సింగరేణి సంస్థ ప్రతి ఏటా నిర్వహించే వార్షిక క్రీడా పోటీల షెడ్యూల్ ప్రకారం, తొలిరోజు ఫుట్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మైదానంలో తలపడే జట్లను టాస్ ను వేసి మొదటి ఆటను కాసిపేట -2 కే కే - 5 వారిచే ఆటను ప్రారంభించారు.అనంతరం జిఎం క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారిని ఉత్సాహపరుస్తూ శుభాకాంక్షలు తెలిపారు.జిఎం శ్రీ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యం - మానసిక ఉల్లాసం. క్రమశిక్షణతో కూడిన ఆటలు మనుషులకు శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు క్రీడలు మంచి ఉపశమనాన్ని ఇస్తాయి. ఆరోగ్యకరమైన, దృఢమైన ఉద్యోగులతోనే సంస్థ మెరుగైన బొగ్గు ఉత్పత్తి సాధించి అభివృద్ధి పథంలో పయనిస్తుంది. సింగరేణి యాజమాన్యం క్రీడలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుంది. అందులో భాగంగానే ప్రతి ఏరియాకు క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ,, 4.50 లక్షల రూపాయలను కేటాయించింది. ఈ నిధులతో క్రీడాకారులకు అవసరమైన అత్యుత్తమ నాణ్యమైన క్రీడా పరికరాలను కొనుగోలు చేయడం జరుగుతుంది. గెలుపోటములు నాణినికి బొమ్మ, బొరుసు లాంటివి. గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు కుంగిపోకుండా సత్ఫలితాల కోసం క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి. ఆటలు వ్యక్తుల్లో సమైక్యతను, నాయకత్వ లక్షణాలను మరియు పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి.మన సంస్థకు చెందిన క్రీడాకారులు కేవలం ఏరియా స్థాయిలోనే కాకుండా, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని సింగరేణి ఖ్యాతిని నలుదిశలా చాటాలి. మైదానంలో చూపించే పట్టుదల, క్రమశిక్షణను పని ప్రదేశంలో కూడా ప్రదర్శించి సంస్థ పురోగతికి భాగస్వాములు కావాలి అని అన్నారు.ఈరోజు ఫుట్ బాల్ విన్నర్స్ గా కే కే - 5 గ్రూప్, రన్నర్స్ గా కాసిపేట -2 గ్రూప్ గెలుపొందినారు.?ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, క్రీడల గౌరవనీయమైన కార్యదర్శి, ఎం.కార్తీక్, క్రీడల సమన్వయకర్త ఎస్.శివ కృష్ణ, క్రీడల జనరల్ కెప్టెన్ సాక శ్రీనివాస్, క్రీడల కెప్టెన్లు ,గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, ఉద్యోగులు మరియు అభిమానులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



## ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ, ఫిట్ మెంట్!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 10**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయుల కు దసరా కానుకగా పిఆర్సీ,పీట్ మెంట్, ను ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తుంది, ఇందులో భాగంగా రెండో వేతన సవరణ కమిషన్ పీఆర్సీ నివేదికను సెప్టెంబర్ 18 వ తేదీ లోపు సమర్పించాలని కమిషన్ చైర్మన్ ఎన్ శివకుమార్ కు సీస్ సంజయ్ జూజు, బుధవారం సాయంత్రం లేఖ రాశారు.పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యాల డీఏ, విడుదల, ఉద్యోగు లు, పెన్షనర్లకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిల విడుదల, సీపీఎస్ ఉపసంహారణ, నూతన వైద్య బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయడం, ఇతర పెండింగ్ సమ స్యలపై సమావేశంలో చర్చ జరిగింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధాన పునరుద్ధరణపై అధ్యయనానికి ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీ కరించింది. పీఆర్సీ సభ్యులు, అధికారు లు, ఉద్యోగ సంఘాల నేతలతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పింది.. ఒకవేళ 18న డీఏలపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానట్లయి తే, 19న జేఏసీ అత్యవసర సమా వేశాన్ని ఏర్పాటు చేసుకుని తదుపరి కార్యాచరణ కార్యక్ర మాన్ని ప్రకటిస్తామని టీజీఈజేఏసీ ప్రకటిం చింది. ప్రభుత్వం నుంచి సానుకూలత రావటంతో ఈ రోజు గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు సంఘాల నేతలు ప్రకటించారు.

## మహబూబ్ నగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం!

**మన దునియా,మహబూబ్‌నగర్: సెప్టెంబర్10**



తెలంగాణలోని మహ బూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ లో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుం ది. మేకలను తరలిస్తున్న డీసీఎం వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్‌తో పాటు సుమారు 200 మేకలు సజీవ దహనమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో జాతీయ రహదారి–కర్నూలు మార్గంలో మేకల లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ రోడ్డు ప్రక్కన ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టింది దీంతో వాహనంలో మంటలు చెదరేగాయి.. వాహనంలోని డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగి నట్లు సమాచారం. మంటలు భారీగా వ్యాపించడంతో క్షణంలో డీసీఎం వ్యాన్ కాలిపోయింది వ్యానులో చిక్కుకున్న డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదు గురు గాయపడ్డట్లు తెలుస్తుంది..వాహనంలో ఉన్న 200 వందలకు పైగా మేకలు కూడా మంటల్లో చిక్కుకుని సజీవ దహనమ య్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు. పోలీసులు కూడా ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. డ్రైవర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రమాదంలో జరిగిన నష్టంపై అధికారులు పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఘట నకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ.. పక్కా స్కెచ్!

**మన దునియా,యడ్లపాడు:**

కొట్లబజార్‌లో బచ్చు నాగపార్వతి (50) ఇంట్లో భారీ చోరీ జరిగింది. హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లడంతో ఇంటికి తాళం వేసి వెళ్లారు. భర్త వెంకట సత్యనారాయణ మరణించడంతో నాగపార్వతి ఒంటరిగా ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు.ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాలు, ఇతర వస్తువులను పరిశీలించారు.సుమారు రూ.75 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు సమాచారం.46 సవర్ల బంగారం, 5 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. నగదుగా సుమారు రూ.50 వేల వరకు చోరీ అయినట్లు తెలుస్తోంది. మొత్తం రూ.75 లక్షల విలువైన సొత్తును దొంగలు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తోంది. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## జన్నారం యువనేతకు NSUI జిల్లా అధ్యక్ష పదవి

### విద్యార్థుల సమస్యల పరిష్కారంలో కీలకంగా పనిచేసిన సోహైల్ షాకు గుర్తింపు

**ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;సెప్టెంబర్ 10:**



జన్నారం మండలాని కి చెందిన యువ నాయకుడు సోహైల్ షాకు NSUI జిల్లా అధ్యక్ష పదవి వరించింది. గత కొన్నేళ్లుగా NSUIలో చురుకుగా పనిచేస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసినందుకు ఆయనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగమైన NSUIలో జిల్లా అధ్యక్ష పదవి అత్యంత కీలకమైన బాధ్యతల్లో ఒకటని NSUI జాతీయ అధ్యక్షుడు వినోద్ జకర్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ సంస్థ బలోపేతానికి కృషి చేసిన సోహైల్ షాకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల జన్నారం ప్రాంతానికి చెందిన కాంగ్రెస్, చీూఖ× నాయకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు సోహైల్ షా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన NSUI జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మాజీ NSUI రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత తెలంగాణ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బలమూరి వెంకట్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, జిల్లాలో చీూఖ×ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని సోహైల్ షా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, NSUI జిల్లా నాయకుల సహకారంతో విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ సంస్థను మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.

## అర్ధరాత్రి అరెస్టులతో విద్యార్థి గొంతును అణచలేరు

- ఆందోళనకు పిలుపే ఇవ్వకపోయినా అరెస్టులా ఇది పోలీస్ ఇంటెలిజెన్స్ వైఫల్యమే: బీఆర్ఎస్వీ






**ఖానాపూర్ ఆర్సి మన దునియా :సెప్టెంబర్ 10:**

బీఆర్ఎస్వీ (భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం) ఎలాంటి ఆందోళనకు పిలుపునివ్వకపోయినా విద్యార్థి నాయకులను అర్ధరాత్రి నుంచే పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి నిర్బంధించడాన్ని బీఆర్ఎస్వీ నాయకులు తీవ్రంగా ఖండించారు.విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని వారు ఆరోపించారు. ఎలాంటి ఆందోళన కార్యక్రమం ప్రకటించకుండానే విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడం పోలీస్ ఇంటెలిజెన్స్ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.అసెంబ్లీలో నిన్న చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం భయంతోనే విద్యార్థి నాయకులను అర్ధరాత్రి నుంచే అక్రమంగా నిర్బంధిస్తోందని ఆరోపించారు. అరెస్టులు, నిర్బంధాలతో విద్యార్థుల గొంతులను శాశ్వతంగా అణచివేయలేరని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, విద్యార్థి నాయకులపై అక్రమ నిర్బంధాలను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు: సుద్దాల మహిపాల్, మునుగురి ప్రణీత్, పూసల మనోజ్, ఆడెపు రవి, చుక్కల నరేష్, శ్రీకాంత్ అమందా, సాయి రాజ్, అంజి, నవీన్.

## తాసిల్దార్ కార్యాలయానికి తాళం

**మన దునియా,సూర్యాపేట జిల్లా:సెప్టెంబర్ 10**



తనకు చెల్లించవ లసిన భవనం అద్దె బకాయిలు సకాలం లో చెల్లించడం లేదని తాసిల్దార్ కార్యాలయానికి తాళం వేసిన ఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో గురువారం చోటుచేసుకుంది 2016లో సూర్యా పేట జిల్లాలో పాలక వీడు మండలంలో నూతనంగా కార్యా లయం ఏర్పడింది, అక్కడ ప్రభుత్వ కార్యాలయ భవనం లేకపోవడంతో అప్పటినుంచి తాసిల్దార్ కార్యాల యం అద్దె భవనం లోనే నిర్వహిస్తుంది, గత రెండు సంవత్స రాలుగా కార్యాలయా నికి సంబంధించిన ఇంటి అద్దె చెల్లించ డం లేదని ఇంటి యజమాని జనార్దన్ రెడ్డి, ఆరోపించారు. అద్దె బకాయిలు చెల్లించాలని ఇప్ప టికే కలెక్టర్, ఆర్డీవోకు తన సమస్యను తెలియజేసినట్లు జనార్దన్‌రెడ్డి తెలిపారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసి అద్దె చెల్లించా లని కోరినప్పటికీ, జీవో పేపర్ తీసుకు రావాలని అధికారు లు సూచిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అద్దె బకాయిలు చెల్లించక చాలా రోజులు గడిచిందని, అద్దె చెల్లించిన తర్వా తే తాళం తీస్తానని ఇంటి యజమాని స్పష్టం చేశారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి తాళం పడటంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటి కైనా స్పందించి ఈ సమస్యను పరి ష్కరించి కార్యాలయ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగించేలా చర్య లు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# శాంతియుతంగా గణపతి ఉత్సవాలు నిర్వహించుకోవాలి మంథని పోలీస్

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:సెప్టెంబర్ 10**



గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, భక్తిశ్రద్ధల తో, ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా గణపతి ఉత్సవాల ను నిర్వహించుకో వాలని మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దే స్వామి, అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు..గురువారం మంథని మండలం లోని సంబంధిత అధికారులతో పాటు గణపతి మండప నిర్వాహకులతో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి స్వామి ఎస్సై సందీప్ కుమార్,ఆధ్వర్యంలో గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సమన్వయ సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బి,స్వామి మాట్లాడుతూ.. గణపతి మండపాల నిర్వహణకు పోలీస్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని పోలీస్ శాఖతో సమన్వయం చేసుకో వాలని సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి తొమ్మిది రోజుల ఉత్సవాలు, ఊరే గింపు, నిమజ్జనం వరకు నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా నిబంధనలు పాటిం చాలని తెలిపారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠా పనకు ముందు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, ఎన్.ఓ.సీలు పొందాలి. ప్రతి మండప నిర్వాహకు లు కమిటీ సభ్యుల వివరాలు, బాధ్యత వహించే వ్యక్తుల మొబైల్ నంబర్లు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశ వివరాల ను పోలీసులకు అందజేయాలని అన్నారు.ఉత్సవాల పేరుతో ప్రజలు, వ్యాపారు లు, దుకాణదారులు, వాహనదారులు లేదా ఇతరులపై ఎలాంటి బలవంతం, బెదిరిం పు లేదా ఒత్తిడి తీసుకురాకుండా, స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలను మాత్ర మే స్వీకరించాలని సూచించారు. మంథని ఎస్ఐ సందీప్ కుమార్ మాట్లాడుతూ... ట్రాఫిక్‌కు అంత రాయం కలిగించే విధంగా మండపాలు ఏర్పాటు చేయకూ డదు. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వంటి అత్యవసర వాహనాలకు మార్గం ఎట్టి పరిస్థితుల్లోనూ నిరోధించరాదు. మండపాలు సురక్షి తంగా నిర్మించడంతో పాటు విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మ ర్లు, ఇతర విద్యుత్ పరికరాల విషయం లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను విద్యుత్ శాఖ అధికారుల అనుమతితో, ఎలక్ట్రీషియన్ల ద్వారా మాత్రమే ఏర్పాటు చేయాలి. అగ్ని ప్రమాద నివారణకు ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరిక రాలు అందుబాటు లో ఉంచాలి. ప్రధాన మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన పాటలు వెయ్యొద్దని డీజేలకు అస్సలు అనుమతి లేదన్నారు.రాత్రి 10 గంటల తర్వాత మైకులు వాడొద్దని సూచించారు.

# ఇంద్ర కీలాద్రి పై శరవేగంగా దసరా ఏర్పాట్లు!

**మన దునియా,విజయవాడ:సెప్టెంబర్ 10**



విజయవాడ ఇంద్రకీ లాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో 2026 సంవత్సరానికి సంబంధించిన దసరా నవరాత్రి మహోత్స వాల షెడ్యూల్‌ను తాజాగా ఆలయ అధికారులు అధికారికంగా విడుదల చేశారు. అక్టోబర్ 11న ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ప్రారంభమై అక్టోబర్ 20న విజయదశమి వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల కాలంలో రోజుకో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్ వి రాజశేఖర్ బాబు, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్ల గురించి ఇంద్రకీలాద్రి అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. దుర్గా ఘాట్ మోడల్ గెస్ట్ హౌస్, ఘాట్ రోడ్డు, బ్యాటరీ వెహికల్స్ పార్కింగ్ క్యూ లైన్ లను పరిశీలించి ప్రధాన ఆలయం చుట్టూ పక్కల ఏర్పాట్ల తో పాటు భక్తులు దర్శనం అనంతరం భక్తులు బయటకు వెళ్లే మార్గం పరిశీలన చేశారు.

2026 దసరా నవరాత్రుల అమ్మవారి అలంకారాలు పట్టిక తేదీలు

అక్టోబర్ 11 ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి శ్రీ బాలా త్రిపురసుందరి దేవి

అక్టోబర్ 12 విదియ శ్రీ గాయత్రీ దేవి

అక్టోబర్ 13 తదియ శ్రీ అన్నపూర్ణా దేవి

అక్టోబర్ 14 చవితి శ్రీ మీనాక్షి దేవి

అక్టోబర్ 15 పంచమి శ్రీ లలితా త్రిపురసుందరి దేవి

అక్టోబర్ 16 షష్ఠి మూలా నక్షత్రం శ్రీ సరస్వతి దేవి..

అక్టోబర్ 17 సప్తమి శ్రీ మహాలక్ష్మీ దేవి

అక్టోబర్ 18 అష్టమి దుర్గాష్టమి శ్రీ దుర్గాదేవి అక్టోబర్ 19 నవమి మహా నవమి,శ్రీ మహిషాసు రమర్దిని దేవి

అక్టోబర్ 20 దశమి విజయదశమి శ్రీ రాజరాజేశ్వరి దేవి

ప్రత్యేక రోజులు, ఆకర్షణలు

అక్టోబర్ 16 (శ్రీ సరస్వతి దేవి అలంకారం,మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు చదు వుల తల్లి సరస్వతి దేవిగా దర్శనమిస్తారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలకు వయోపరిమితి మరో మూడేళ్లు పెంపు!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 10**

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది,పోలీస్, అగ్నిమాపక, జైళ్ల, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ శాఖల్లోని కానిస్టేబుల్, సమాన స్థాయి పోస్టుల ప్రత్య క్ష నియామకాలకు గరిష్ఠ వయోపరిమి తిని మరో మూడేళ్లు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే యూనిఫాం సర్వీసుల ప్రత్యక్ష నియామకాలకు ఇచ్చిన ఏడేళ్ల వయో సడలింపునకు అద నంగా ఈ మూడేళ్ల వెసులుబాటు కల్పించారు.హోంశాఖలో సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టుల వయోపరిమితుల్లో ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడమే తాజా నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు ఎస్సై పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 32 ఏళ్లు, కానిస్టేబుల్ పోస్టులకు 29 ఏళ్లుగా ఉంది. దీంతో కానిస్టేబుల్ స్థాయి పోస్టులకు మరో మూడేళ్ల సడలింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజా ఉత్తర్వులతో అర్హత ఉన్న మరింత మంది అభ్యర్థులు పోలీస్ కొలువులకు పోటీ పడే అవకాశం లభించనుంది.ఈ సడలింపు పోలీస్ శాఖతో పాటు ఫైర్ సర్వీసెస్, ప్రిజన్స్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లోని కానిస్టే బుల్, సమాన స్థాయి పోస్టులకు వర్తించ నుంది. అయితే పోలీస్ శాఖలోని కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టులకు మాత్రం మూడేళ్ల పెంపు వర్తిం చదు. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చేపట్టే ప్రత్యక్ష నియా మకాల్లో ఈ నిబంధ నలు అమల్లోకి రానున్నాయి. బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల సమస్య లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని పెంచడంతో పాటు పోలీస్ నియామకాల ఫిజికల్ ఈవెంట్లలో లాంగ్‌జంప్ అర్హత ప్రమాణాన్ని సడలించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వం కానిస్టేబుల్ స్థాయి పోస్టులపై వయో పరిమితి పెంపునకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# శిరీష దిశదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య





**మన దునియా ములకలపల్లి,చవిటిగూడెం: సెప్టెంబర్ 10**

ములకలపల్లి మండలంలో చవిటిగూడెం గ్రామంలో ఊకె శిరీష దిశ దిన కార్యక్రమంలో పాల్గొన్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే,సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య.ఈ సందర్భంగా శిరీష చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.శిరీష మృతికి కారణమైన నిందితులకు ఉరిశిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,శిరీష మృతిని తీవ్రంగా ఖండిస్తున్నామని వారి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు.శిరీష మృతి పై వచ్చిన ఆరోపణలను పోలీసులు ఎలాంటి పక్షపాతం లేకుండా సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.హాస్పిటల్ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్,జాటోత్ కృష్ణ,ప్రసాద్ మరియు సంయుక్త మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ,మండల నాయకులు నకిరికంటి నాగేశ్వరరావు,నూపా సరోజిని,ఎర్ర గొర్ల రామారావు, శాత్రబోయిన వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

# నర్మెట పామాయిల్ ఫ్యాక్టరీకి.. నీటి గండం.. రంగనాయక సాగర్ లో అడుగంటిన జలాలు

**బోర్లు, ట్యాంకర్ల ద్వారా సేకరణ**

**తపాసుపల్లి, దేవాదుల నుంచి నీటి తరలింపునకు ప్రయత్నాలు**

**మన దునియా,సిద్దిపేట జిల్లా:సెప్టెంబర్ 10**




సిద్దిపేట : సిద్దిపేట జిల్లాబి నంగునూరు మండలం నర్మెటలో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నీటి కష్టాలు వెంటాడుతున్నాయి.రంగనాయక సాగర్ లో నీటిమట్టం కనిష్ట స్థాయికి పడిపోవడంతో అక్కడి నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. మరో వైపు ఫ్యాక్టరీలోని నీటి నిల్వలు సైతం పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ప్రస్తుతం బోర్లు, ట్యాంకర్లపై ఆధారపడుతూ ఫ్యాక్టరీని నడిపిస్తున్నారు. భవిష్యత్ లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ చర్యలపై ఆఫీసర్లు దృష్టి పెట్టారు.

రోజుకు ఆరు లక్షల లీటర్ల వినియోగం

నర్మెట గ్రామంలో 65 ఎకరాల్లో రూ. 300 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఈ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మార్చిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ఫ్యాక్టరీ గంటకు 30 టన్నుల క్రషింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉండగా.. ఉత్పత్తి పెరిగే కొద్ది క్రషింగ్ సామర్థ్యాన్ని రోజుకు 600 టన్నులకు పెంచుకునే విధంగా రూపకల్పన చేశారు. ఈ ఫ్యాక్టరీలో ఆయిల్ పామ్ క్రషింగ్ కు ప్రతి రోజు ఆరు లక్షల లీటర్ల నీరు అవసరం పడుతుంది.కానీ ఉత్పత్తి ప్రారంభించిన ఆరు నెలల్లోనే ఫ్యాక్టరీలో నీటి కొరత ఏర్పడింది. ఫ్యాక్టరీ అవసరాల కోసం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ వద్ద నిర్మించిన రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఫ్యాక్టరీలో 10 కోట్ల లీటర్ల కెపాసిటీ కలిగిన పాండ్ నుంచి నిర్మించి, సుమారు ఏడు కోట్ల లీటర్ల నీటిని నింపి ఫ్యాక్టరీ అవసరాల కోసం వాడుకుంటున్నారు. కొంత కాలంగా రంగనాయక సాగర్ రిజర్వాయర్ లో నీటి మట్టాలు కనిష్ట స్థాయికి చేరడంతో అక్కడి నుంచి సరఫరా నిలిచిపోయింది.దీనికి తోడు ఫ్యాక్టరీలోని నీటి నిల్వలు సైతం పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆయిల్ పామ్ క్రషింగ్ కు పీక్ సీజన్ కావడంతో ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైన నీటిని అతి కష్టం మీద సేకరిస్తున్నారు. ఫ్యాక్టరీలోని పాండ్ పూర్తిగా ఎండిపోవడంతో స్థానికంగా ఉన్న బోర్లు, ప్రైవేట్ ట్యాంకర్ల తో నీటిని సమకూర్చుకుని ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూసుకుంటున్నారు.

తపాసుపల్లి, దేవాదుల నీటి తరలింపునకు ప్రయత్నాలు

పామాయిల్ క్రషింగ్ పీక్ సీజన్ లో ఎవరూ ఊహించని విధంగా నీటి ఎద్దడి ఏర్పడడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆఫీసర్లు దృష్టి సారించారు. ప్రస్తుతం రోజు వారీ ఫ్యాక్టరీ కోసం బోర్లపై ఆధారపడినా భవిష్యత్ లో నీటి ఎద్దడి మరింత తీవ్రమైతే ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం అవుతోంది. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో తపాసుపల్లి గానీ, దేవాదుల నుంచి గానీ నీటిని మళ్లించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.ఆయా రిజర్వాయర్ల నుంచి నీటి తరలింపు కోసం అనుగుణంగా కాల్వలు ఉన్నాయా అనే విషయంపై ఇటీవలే ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించారు. కానీ ఇది కార్యరూపం దాల్చేందుకు మరింత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. దీనికి తోడు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాల మట్టాలు సైతం క్రమంగా పడిపోతున్నాయి. ప్రస్తుతానికి బోర్లపై ఆధారపడి క్రషింగ్ చేస్తున్నా... రానున్న రోజుల్లో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయోననే ఆందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు ఫ్యాక్టరీ నుంచిబి వెలువడే మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి వాడుకునే అవకాశాలను సైతం పరిశీలిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో నీటి ఎద్దడి ఏర్పడినా క్రషింగ్ పై ఎలాంటీ ప్రభావం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. రంగనాయక సాగర్ నుంచి నీళ్లు రాకపోవడం వల్ల ఫ్యాక్టరీలోని పాండ్ ఎండిపోవడంతో తాత్కాలికంగా బోర్లు, ట్యాంకర్ల తో రోజు వారీ నిర్వహణకు నీటిని తెప్పిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. తపాసుపల్లి, దేవాదుల నుంచి నీటిని తరలించడానికి ఉన్న అవకాశాలపై ఇరిగేషన్ అధికారులు సర్వే పూర్తి చేశారు.

## ‘జలసిరి’ని సమర్థవంతంగా అమలు చేయాలి: సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి

**మన దునియా,సిద్దిపేట జిల్లా:సెప్టెంబర్ 10**

సిద్దిపేట: వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని సిద్దిపేట కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ భవనంతో పాటు అన్ని గృహాల్లో ఇంకుడు గుంతలు, ప్రతి పొలానికి పంటకుంట వంటి నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.




## ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో పీఆర్సీ, ఫిట్ మెంట్!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 10**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయు లకు దసరా కానుకగా పిఆర్సీ,పీట్ మెంట్, ను ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తుంది, ఇందులో భాగంగా రెండో వేతన సవరణ కమిషన్ పీఆర్సీ నివేదికను సెప్టెంబర్ 18 వ తేదీ లోపు సమర్పించాలని కమిషన్ చైర్మన్ ఎన్ శివకుమార్ కు సీస్ సంజయ్ జూజు, బుధవారం సాయంత్రం లేఖ రాశారు.పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యాల డీఏ, విడుదల, ఉద్యోగు లు, పెన్షనర్లకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిల విడుదల, సీపీఎస్ ఉపసంహరణ, నూతన వైద్య బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయడం, ఇతర పెండింగ్ సమ స్యలపై సమావేశంలో చర్చ జరిగింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధాన పునరుద్ధరణపై అధ్యయనానికి ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడానికి అంగీ కరించింది. పీఆర్సీ సభ్యులు, అధికారు లు, ఉద్యోగ సంఘాల నేతలతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పింది..ఒకవేళ 18న డీఏలపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం రానట్లయి తే, 19న జేఏసీ అత్యవసర సమా వేశాన్ని ఏర్పాటు చేసుకుని తదుపరి కార్యాచరణ కార్యక్ర మాన్ని ప్రకటిస్తామని టీజీఈజేఏసీ ప్రకటిం చింది. ప్రభుత్వం నుంచి సానుకూలత రావటంతో ఈ రోజు గురువారం తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు సంఘాల నేతలు ప్రకటించారు.

## శాసన మండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

**మన దునియా,హైదరాబాద్, సెప్టెంబర్ 10:**




తెలంగాణ శాసనమండలి నుంచి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సభ్యులు వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన తర్వాత 22ఎపై చర్చించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పట్టుబట్టారు. అందుకోసం వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను శాసనమండలి చైర్మన్ తిరస్కరించారు.దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. చైర్మన్ పోడియం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పేపర్లు చించి గాలిలోకి ఎగరేశారు. అనంతరం మండలి నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించిన బీఆర్ఎస్ సభ్యులు బయటకు వెళ్లిపోయారు..

## ఫారెస్ట్ సెక్షన్ అధికారిపై అవినీతి ఆరోపణలు

**విచారణ చేపట్టాలని డీబీ తండా సర్పంచ్, ఉపసర్పంచ్ వినతి**

**నిజామాబాద్ జిల్లా, మన దునియా: ప్రతినిధి:**


గ్రామ పంచాయతి కార్యాలయము, డి.బి.తాండ.
GRAMA PANCHAYATH, DB.THANDA
Mdl. Dharpally, Dist. Nizamabad. 503165 (T.G.)

నిజామాబాద్ జిల్లా, ధర్పల్లి, సెప్టెంబర్ 10: ధర్పల్లి మండలం డీబీ తండాకు చెందిన సర్పంచ్, ఉపసర్పంచ్ గురువారం బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఇందల్వాయి రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సెక్షన్ అధికారి రాథోడ్ తుకారం తీరుపై పలు ఆరోపణలు చేస్తూ విచారణ చేపట్టాలని కోరారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. తుకారం సెక్షన్ అధికారిగా బాధ్యతలు చేపట్టి సుమారు రెండేళ్లు అవుతుందని తెలిపారు. ఈ కాలంలో గ్రామంలోని చెరువు భూమిని చదును చేసి లేఅవుట్ చేయడం, ఫారెస్ట్ పరిధిలో బోరు ఏర్పాటు చేయడం వంటి అంశాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అలాగే డబ్బులు చెల్లించిన వారికి పనులు జరుగుతున్నాయని, ఇతరులపై కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. డీబీ తండా పూర్తిగా ఎస్టీ లంబాడీ గ్రామమని, గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారిపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎఫ్‌ను సర్పంచ్, ఉపసర్పంచ్ కోరారు.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి పొన్నం

**మన దునియా,హైదరాబాద్, సెప్టెంబర్ 10**



ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం టీజీఎస్ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్టీసీ డిపోలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి మండలంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లో ఆర్టీసీ డిపోల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మిర్యాలగూడలో నూతన డిపో ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. చనిపోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు..

మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

# దళితులు అంటే కేసీఆర్‌కు ఇంత అహంకారమా?

**దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడమా?**

**దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచిన కేసీఆర్, బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి**

**ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉంది**

**మల్లంపల్లి ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సాంబయ్య**

**మన దునియా,ములుగు జిల్లా,మల్లంపల్లి:సెప్టెంబరు 10**



దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించడం ఏమిటని మల్లంపల్లి ఎస్సీ సెల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సాంబయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని ప్రశ్నించారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉండాలని, దళితులను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించరాదని అన్నారు. దళితుల ఆత్మగౌరవంపై ప్రశ్నలు దళితులు నడిచిన నేలను శుద్ధి చేశారనే ఆరోపణలు నిజమైతే అది దళితుల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీసే చర్య అని సాంబయ్య పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి దళితుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆరోపణలపై కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ స్పందించి వివరణ ఇవ్వాలని సాంబయ్య డిమాండ్ చేశారు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు. అవమానాలను సహించేది లేదు దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి చర్యలనైనా తాము వ్యతిరేకిస్తామని సాంబయ్య అన్నారు. ఈ ఆరోపణలపై వాస్తవాలను ప్రజల ముందుంచి, బాధ్యులెవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

# షాద్‌నగర్‌లో “కారు” రెండు దారులు!

**నియోజక వర్గాన్నే నమ్ముకున్న అంజయ్య యాదవ్**

**రాష్ట్ర రాజకీయాల్లో నవీన్ రెడ్డి దూకుడు..**

**ఒకరి అడుగులు రాష్ట్రం వైపు.. మరొకరి చూపు షాద్‌నగర్‌పైనే**

**రాబోయే ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి అండగా నిలుస్తుంది?**

**షాద్‌నగర్ “గులాబీ” ముఖ చిత్రం**

**మన దునియా,షాద్‌నగర్:సెప్టెంబర్ 10**




బీఆర్ఎస్ రాజకీయాల్లో కారు గేరు మారినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆందోళనలు, ఉద్యమాలను ఉధృతం చేస్తున్న వేళ.. షాద్‌నగర్ నియోజకవర్గంలో మాత్రం రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఒక కారు రెండు దారులు అంటున్నారు రాజకీయ మేధావులు. ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ముఖ్య నేతలు రెండు విభిన్న మార్గాల్లో రాజకీయ ప్రయాణం సాగిస్తున్నారు. ఒకవైపు పాలమూరు ఎమ్మెల్సీ, స్థానిక నేత నాగర్‌కుంట నవీన్ రెడ్డి రాష్ట్రస్థాయి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటుండగా.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ నియోజకవర్గానికే పరిమితమై పార్టీ బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు.

**రాష్ట్ర రాజకీయాల చుట్టూ నవీన్ రెడ్డి..**

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలలో గులాబీ బాస్ కేటీఆర్ తో కలిసి చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో కలిసి పలు నిరసన కార్యక్రమాల్లో ఇటీవల ఆయన ముందుండటం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేయాలనే ఉద్దేశంతో నవీన్ రెడ్డి దూకుడుగా ముందుకు సాగుతున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే అదే దూకుడు కొన్ని సందర్భాల్లో వివాదాలకు కూడా దారితీస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పోలీసులతో వాగ్వాదాలు, తన, పర భేదం లేకుండా తన ప్రత్యర్థులను ఒకే గాటిన కట్టి ఘాటైన వ్యాఖ్యల వంటి అంశాలు సామాజిక మాధ్యమాల్లో చర్చకు వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. గతంలోనూ సర్పంచ్ ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నేతలతో పాటు సొంత పార్టీకి చెందిన అంజయ్య యాదవ్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపిన సందర్భాలు ఉన్నాయని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ సాగింది. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో సహా తన పార్టీకే చెందిన అంజయ్య యాదవ్ ను కూడా టార్గెట్ చేసి గతంలో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. ఏకంగా కేటీఆర్ కల్పించుకొని ఎవరిని చేసిన షాద్ నగర్ గడ్డ అంజయ్య అడ్డా అంటూ తీర్చి పారేశారు. అంజయ్య పై విమర్శలు చేసిన నవీన్ రెడ్డి ఏం చేయాలో తెలియక అప్పట్లో సైలెంట్ అయిపోయారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు ఆయన మరో వ్యూహాన్ని ప్రదర్శించి ఏకంగా కేటీఆర్ వెంట రాష్ట్రస్థాయిలో ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. తాజాగా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదాల్లో నవీన్ రెడ్డి ఇదే దూకుడు ప్రదర్శించి ప్రభుత్వం దృష్టిలో పడ్డారు. అంతేకాదు నవీన్ రెడ్డి పై రెండు కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్సీని దూషించిన వ్యవహారంలో తాతా మధుతో కలిసి ఒక కేసు అదేవిధంగా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదంలో మరో కేసు కేటీఆర్ తో కలిసి మరొక కేసు అతనిపై నమోదయింది. రాజకీయాలు దూకుడు స్వభావం ఉన్న నవీన్ రెడ్డి భవిష్యత్తులో కూడా ఇదే దూకుడు ప్రదర్శిస్తే రాజకీయంగా ఏమవుతుందో తెలియదు కానీ కొంత ఇబ్బందికర పరిస్థితిలో ఎదురవుతాయని విశ్లేషకులు అంటున్నారు.నవీన్ రెడ్డి అనుసరిస్తున్న దూకుడు రాజకీయ శైలి ఆయనకు భవిష్యత్తులో రాజకీయంగా కలిసొస్తుందా? లేక ప్రతికూల ప్రభావం చూపుతుందా? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**అంజన్న రూటే వేరు..**

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రాజకీయ శైలి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రాజకీయాలకు మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ విధానాలపై విమర్శలు చేయడం తన రాజకీయ శైలిగా కొనసాగిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా, పార్టీ బాధ్యతల్లో ఉన్న సమయంలోనూ ఆయన ప్రధానంగా షాద్‌నగర్ నియోజకవర్గంపైనే దృష్టి సారించారు. అందుకే ఆయనను ప్రజలు రెండు పర్యాయాలు ఆదరించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సాదాసీదా రాజకీయాలను నడిపారు. ప్రస్తుతం కూడా రాష్ట్రస్థాయి ఆందోళనల కంటే నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడం, పార్టీ ఉనికిని బలోపేతం చేయడంపైనే అంజన్న ఎక్కువగా దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది.అధికార పార్టీపై రాజకీయ పోరాటం కొనసాగిస్తూనే.. స్థానికంగా పార్టీ శ్రేణులను ఏకం చేయడమే తన మార్గంగా అంజయ్య యాదవ్ ముందుకు సాగుతున్నారు. ఆయనకు కుమారుడు రవీందర్ యాదవ్ కూడా రాజకీయంగా సహకరిస్తూ చురుకుగా పనిచేస్తుండటం బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్న అంజన్న రాజకీయాల స్టైల్ వేరు. చేసే పని పక్కాగా ఉంటుంది. వివాదారహితుడిగా ఆయనకు నియోజకవర్గం లో మంచి పేరుంది. ఎదుటివారు తనను తిట్టిపోసిన తిరిగి అర్ధవంతమైన విమర్శ తప్ప తిరిగి తిట్టే స్వభావం ఆయనది కాదు. నియోజకవర్గ రాజకీయాల్లో ఓడిపోయినా పార్టీలో ప్రజల్లో ఇంకా గట్టి పట్టు పెంచుకున్న అంజయ్య యాదవ్ పైనే బిఆర్ఎస్ అధిష్టానం ఆధారపడి ఉంది అన్నది జగద్వితం. అందుకే నవీన్ రెడ్డి గతంలో ఆయనను పేరు పెట్టి తిట్టిన విమర్శించినా కేవలం అధిష్టానానికి ఫిర్యాదు చేశారే తప్ప పార్టీ క్రమశిక్షణ తప్పకుండా విలువలకు తాను ఎప్పుడు తిలోదకాలు ఇవ్వలేదు. తన స్వంత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి అంజయ్య యాదవ్ వర్గాలకు మధ్య ఘర్షణ జరిగినా అధిష్టానం అంజయ్య వైపే నిలవడం కోసం మెరుపు.

**ఒకరి ప్రయాణం రాష్ట్రం వైపు.. మరొకరి ప్రయాణం నియోజకవర్గం వైపు!**

నవీన్ రెడ్డి రాష్ట్రస్థాయి రాజకీయాల్లో చురుకుగా కనిపిస్తుంటే.. అంజయ్య యాదవ్ మాత్రం తన నియోజకవర్గంలో పార్టీకి బలమైన పునాది ఏర్పాటు చేసుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారు. ఇద్దరి లక్ష్యం పార్టీ బలోపేతమే అయినా.. అందుకు ఎంచుకున్న మార్గాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తున్న రాజకీయ వర్గాలు మాత్రం పురాణాల్లోని వినాయకుడు, కుమారస్వామి కథను గుర్తు చేసుకుంటున్నాయి. ప్రపంచాన్ని చుట్టి రావడానికి కుమారస్వామి వేగంగా బయలుదేరితే.. వినాయకుడు మాత్రం తన తల్లిదండ్రులే తన ప్రపంచమని భావించి వారి చుట్టూ ప్రదక్షిణలు చేసి విజయం సాధించిన కథ తెలిసిందే. అదే విధంగా ఒకరు రాష్ట్ర రాజకీయాల చుట్టూ చురుగ్గా తిరుగుతుంటే.. మరొకరు తన నియోజకవర్గాన్నే రాజకీయ ప్రపంచంగా భావించి అక్కడే పార్టీని బలోపేతం చేసే పనిలో ఉన్నారు. భవిష్యత్తు ఎవరిది ఈ ఇద్దరి పొలిటికల్ గేమ్ లో అసలు ప్రశ్న ఇప్పుడు ఇదే. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ అధిష్టానం ఎవరికి ప్రాధాన్యత ఇస్తుంది? రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్న నవీన్ రెడ్డికా? లేక నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ స్థానికంగా బలాన్ని పెంచుతున్న అంజయ్య యాదవ్‌కా? రాజకీయాల్లో ఎవరి ప్రయాణం సరైనదో కాలమే నిర్ణయిస్తుంది. రాష్ట్ర రాజకీయాల్లో దూకుడుగా ముందుకు సాగుతున్న నవీన్ రెడ్డి ప్రయాణం ఒకవైపు.. షాద్‌నగర్ నియోజకవర్గానికే ప్రాధాన్యతనిస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న అంజయ్య యాదవ్ ప్రయాణం మరోవైపు.. ఇద్దరి రాజకీయ మార్గాలు చివరకు ఎక్కడ కలుస్తాయి? రాబోయే ఎన్నికల్లో అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది? షాద్‌నగర్ రాజకీయాల్లో ‘కారు’ ఏ దారిలో ముందుకు వెళ్తుంది? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే..!

# పంచాయతీలకు నిధుల వినియోగంలో జాప్యానికి చెక్

- పంచాయతీరాజ్ సవరణ బిల్లుతో గ్రామాల అభివృద్ధికి మరింత ఊతం
- అసెంబ్లీలో సవరణ బిల్లుకు మద్దతుగా మాట్లాడిన ఎమ్మెల్యే డా. . భూపతి రెడ్డి

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను మరింత సులభంగా, వేగంగా వినియోగించుకునేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018 (నాలుగో సవరణ) బిల్లు-2026 కు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శాసనసభలో మద్దతు తెలిపారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధుల కొరతతో పాటు నిధుల వినియోగంలో జాప్యాన్ని తొలగించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 70, సబ్ సెక్షన్ (3)కు సవరణ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన బిల్లుపై ఎమ్మెల్యే భూపతి రెడ్డి గురువారం సభలో మాట్లాడారు. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల కింద వచ్చే నిధులు ట్రెజరీ ద్వారా జమ కావడం, వాటిని అభివృద్ధి పనులు, సిబ్బంది జీతాలు, ఇతర అవసరాలకు వినియోగించుకునే క్రమంలో అనేక పరిపాలనా ప్రక్రియల కారణంగా జాప్యం జరుగుతుండేదని ఎమ్మెల్యే వివరించారు. కొన్ని సందర్భాల్లో నిధుల ఉపసంహరణకు నెలల సమయం పట్టడంతో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఆలస్యమయ్యేవని తెలిపారు.

గ్రామాల అవసరాలకు అనుగుణంగా నిధుల వినియోగం

కొత్త సవరణతో గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, వివిధ పథకాల ద్వారా వచ్చే నిధులను స్థానిక సహకార బ్యాంకులు, జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జమ చేసుకునే అవకాశం కలుగుతుందని భూపతి రెడ్డి తెలిపారు. దీనివల్ల గ్రామ పంచాయతీలు తమ అవసరాలకు అనుగుణంగా నిధులను సకాలంలో వినియోగించుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేసుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పంచాయతీ భవనాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి నిధుల సకాలంలో లభ్యత ఎంతో కీలకమని ఆయన అన్నారు. నిధులు ఉన్నప్పటికీ వాటి వినియోగంలో జాప్యం జరగడం వల్ల గ్రామాల అభివృద్ధి ప్రభావితం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సవరణను తీసుకురావడం అభినందనీయమన్నారు.

స్థానిక సంస్థల బలోపేతమే ప్రజాపాలన లక్ష్యం

గ్రామ పంచాయతీలను మరింత స్వయం సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక సంస్థలకు పరిపాలనా సౌలభ్యాన్ని కల్పించడంలో ఈ సవరణ కీలక అడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. “గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆలస్యం కాకుండా, ప్రజలకు అవసరమైన పనులకు సకాలంలో అందుబాటులోకి రావాలి. నిధుల వినియోగంలో జాప్యాన్ని తగ్గించి, గ్రామ పంచాయతీలకు మరింత



వెసులుబాటు కల్పించే ఈ సవరణను స్వాగతిస్తున్నాను” అని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయడం, గ్రామీణాభివృద్ధికి వేగం పెంచడం ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటని భూపతి రెడ్డి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో పారదర్శకతను కొనసాగిస్తూ, నిధులు సకాలంలో ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడే ఈ సవరణ బిల్లుకు శాసనసభలో తన సంపూర్ణ మద్దతు ఉంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి స్పష్టం చేశారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఎడ్ల పోలాల అమావాస్యకు పల్లెల్లో సందడి





● **ఎడ్లు లేని చోట ట్రాక్టర్లకు పూజలు.. పశువులతో హనుమాన్ ఆలయ ప్రదక్షిణలు**

**బోధన్ గ్రామీణ ప్రతినిధి సెప్టెంబర్ 10 ( మన దునియా ):**

నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్ల పోలాల అమావాస్య పండుగను రైతులు, గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. వ్యవసాయంలో తమకు తోడుగా నిలిచే ఎడ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కృతజ్ఞతలు తెలిపారు.కొన్ని గ్రామాల్లో ఎడ్లను అందంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. మరికొన్ని గ్రామాల్లో ఎడ్లు లేకపోవడంతో వ్యవసాయానికి ప్రధాన ఆధారంగా మారిన ట్రాక్టర్లను శుభ్రం చేసి పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎడపల్లి మండలం పోచారం గ్రామంలో కూడా ఎడ్ల పోలాల అమావాస్య వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు బాజనోళ్ల గంగారం, కోశాధికారి లక్ష్మీనారాయణ, వీడీసీ సభ్యులు కట్ట సుధాకర్, చిన్న లక్ష్మయ్య, కట్ట నడిపి, వార్డు నంబర్ గైని సుధాకర్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళల ఆసియా కప్ సెమీస్: టాస్ గెలిచిన బంగ్లాదేశ్.. భారత్‌కు బ్యాటింగ్!

**మహిళల ఆసియా కప్ సెమీ ఫైనల్లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్**

**భారత్‌తో మ్యాచ్‌లో తొలుత బౌలింగ్ ఎంచుకున్న బంగ్లా**

**దుబాయ్ వేదికగా జరుగుతున్న కీలక నాకౌట్ పోరు**

**గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది**

**గత మ్యాచ్ ఆడిన జట్లతోనే బరిలోకి దిగుతున్న ఇరు జట్లు**





మహిళల ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌లో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా జరుగుతున్న తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం వేదికగా గురువారం జరుగుతున్న ఈ కీలక పోరులో, భారత జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే టైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. ఈ హై-వోల్టేజ్ నాకౌట్ మ్యాచ్ కోసం ఇరు జట్లు తమ గత కూర్పులలో ఎలాంటి మార్పులు చేయకుండానే బరిలోకి దిగాయి.గ్రూప్-ఏలో అద్భుత ప్రదర్శన చేసిన ఏడుసార్లు ఛాంపియన్ భారత్, ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా సెమీస్‌కు చేరింది. థాయ్‌లాండ్, హాంగ్ కాంగ్-చైనా, పాకిస్థాన్‌లపై వరుస విజయాలతో అజేయంగా నిలిచింది. టాస్ ఓడిపోవడంపై భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్పందిస్తూ, "నిజం చెప్పాలంటే, మేము ముందుగా బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం. బోర్డుపై పరుగులు ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మాకు బ్యాటింగ్ రావడం మంచిదే అయింది. టీ20 ఫార్మాట్‌లో ఏ జట్టునూ తక్కువ అంచనా వేయలేం. ఈ పిచ్ చాలా సంక్లిష్టంగా ఉంది. పవర్‌ప్లే ముగిశాక పరిస్థితులను బట్టి ఎంత స్కోర్ చేయాలో నిర్ణయించుకుంటాం" అని తెలిపింది.మరోవైపు, 2018లో ఛాంపియన్‌గా నిలిచిన బంగ్లాదేశ్, గ్రూప్-బీలో రెండో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరుకుంది. మంగళవారం నాడు యూఏఈతో జరిగిన తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో విజయం సాధించి నాకౌట్‌కు అర్హత పొందింది. టాస్ గెలిచిన అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ నిగర్ సుల్తానా మాట్లాడుతూ, "ఇక్కడి పరిస్థితులను చూసి మేము బౌలింగ్ ఎంచుకున్నాం. మా బౌలర్లకు వికెట్ నుంచి సహకారం లభిస్తుందని భావిస్తున్నాం. 2018 నాటి విజయాలు మాకు గుర్తున్నాయి, కానీ ఇది మాకు చాలా ముఖ్యమైన రోజు. ఈ మ్యాచ్‌లో బాగా ఆడితే ఫైనల్ ఆడే మరో అవకాశం దొరుకుతుంది" అని పేర్కొంది.భారత్: షఫాలీ వర్మ, స్మృతి మంధాన, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, భారతి ఫుల్మాలి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), ప్రేమ రావత్, ఎన్. శ్రీ చరణి, క్రాంతి గౌడ్, నందిని శర్మ. బంగ్లాదేశ్: దిలారా అక్తర్, జురియా ఫెర్డస్, శోభన మోస్తరీ, నిగర్ సుల్తానా (కెప్టెన్ & వికెట్ కీపర్), షర్మిన్ అక్తర్, షోర్నా అక్తర్, ఫహీమా ఖాతూన్, నహిదా అక్తర్, రబేయా ఖాన్, సుల్తానా ఖాతూన్, మరుఫా అక్తర్.

## బ్యాట్ నాకు క్రీడా పరికరం మాత్రమే కాదు: సచిన్ ఎమోషనల్ పోస్ట్

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ తన క్రీడా జీవితంలోని మధుర జ్ఞాపకాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. తన విజయాల్లో కీలక పాత్ర పోషించిన క్రికెట్ బ్యాట్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. బ్యాట్ అనేది తనకు కేవలం ఒక క్రీడా పరికరం మాత్రమే కాదని పేర్కొన్నాడు."నా దృష్టిలో బ్యాట్ అనేది కేవలం ఒక పరికరం కాదు. దానిని చేతుల్లోకి తీసుకున్నప్పుడు ఎలాంటి అనుభూతి కలుగుతుందో నాకు స్పష్టంగా తెలుసు. అందుకే అతి చిన్న అంశాలపై కూడా నేను ప్రత్యేక శ్రద్ధ వహించేవాడిని" అని సచిన్ తన పోస్టులో పేర్కొన్నాడు. అవసరమైనప్పుడు తన వద్ద ఉన్న కార్పెంటరీ కిట్‌ను బయటకు తీసి, బ్యాట్‌కు స్వయంగా మెరుగులు దిద్దుకునేవాడినని గుర్తుచేసుకున్నాడు. తనకు నచ్చిన ఆకృతి, సరైన పట్టు లభించే వరకు దానిపై స్వయంగా పని చేసేవాడినని వివరించాడు. ఈ క్రమంలో గడిపిన చిన్న చిన్న క్షణాలు తనకు ఎంతో మధురంగా గుర్తున్నాయని సచిన్ తెలిపాడు. "నిజానికి ఆ జ్ఞాపకాలు కేవలం బ్యాట్‌కు సంబంధించినవి మాత్రమే కాదు, ఆ ప్రక్రియ ద్వారా ఆ బ్యాట్‌ను నా సొంతం చేసుకోవడానికి సంబంధించినవి" అంటూ తన పోస్టును ముగించాడు.



## ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా మధు యాష్కీ గౌడ్ ఎంపిక అభినందనీయం: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**మర్యాదపూర్వకంగా కలిసిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి**

**నూతన బాధ్యతలపై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**

**పూల మొక్క అందజేసి, శాలువాతో సత్కారం**



**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

హైదరాబాద్‌లో గురువారం ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా ఎంపికైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.. భూపతి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా మధు యాష్కీ గౌడ్ ఎంపికైనందుకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూల మొక్కను అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న నిపుణులు, మేధావులు, వృత్తి నిపుణులను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, పాలన, ఆర్థిక మరియు సామాజిక అంశాలపై నిపుణుల సూచనలు, సలహాలను విధాన రూపకల్పనలో భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మధు యాష్కీ గౌడ్‌కు జాతీయ స్థాయిలో లభించిన ఈ బాధ్యత కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ రాష్ట్రానికి కూడా గర్వకారణమని భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఆయన అనుభవం, నాయకత్వ సామర్థ్యం, ప్రజా సమస్యలపై అవగాహనను ఉపయోగించుకుని ప్రొఫెషనల్స్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తారని ఆకాంక్షించారు.

## బంగ్లాదేశ్ తో సెమీస్.. ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైన టీమిండియా అమ్మాయిలు

**మహిళల ఆసియా కప్ సెమీ ఫైనల్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్**

**తొలుత బ్యాటింగ్ చేసిన భారత్**

**విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన ఓపెనర్ షఫాలీ వర్మ**

**20 ఓవర్లలో 6 వికెట్లకు 149 పరుగులు చేసిన టీమిండియా**

**బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్‌కు రెండు వికెట్లు**

**ఫైనల్ బెర్త్ కోసం బంగ్లాదేశ్ ముందు 150 పరుగుల లక్ష్యం**

మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో ఫైనల్ బెర్త్ లక్ష్యంగా జరుగుతున్న తొలి సెమీ ఫైనల్‌లో భారత మహిళల జట్టు పోరాడే స్కోరు సాధించింది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న ఈ కీలక మ్యాచ్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ (64) మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. దీంతో ఫైనల్ చేరాలంటే బంగ్లాదేశ్ ముందు 150 పరుగుల లక్ష్యం నిలిచింది.దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బంగ్లా బౌలర్లు తమ కెప్టెన్ నిర్ణయం సరైనదేనని నిరూపిస్తూ ఆరంభంలోనే భారత్‌కు షాకిచ్చారు. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ స్మృతి మంధన (2) రెండో ఓవర్‌లోనే సుల్తానా ఖాతూన్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో భారత్ 9 పరుగులకే తొలి వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది.ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతిక రావల్‌తో కలిసి షఫాలీ వర్మ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడినా, కుదురుకున్న తర్వాత షఫాలీ తనదైన శైలిలో బౌండరీలతో విరుచుకుపడింది. ముఖ్యంగా బంగ్లా బౌలర్లను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో కేవలం 40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. రెండో వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత ప్రతిక రావల్ (20) ఔటవ్వగా, కాసేపటికే షఫాలీ కూడా పెవిలియన్ చేరింది.షఫాలీ ఔటైన తర్వాత స్కోరు వేగం కాస్త మందగించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్) ఒక ఎండ్‌లో నిలకడగా ఆడినా, పరుగులు వేగంగా రాలేదు. అయితే, చివరి ఓవర్లలో వికెట్ కీపర్ రిచా ఘోష్ (16 బంతుల్లో 21), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (6 బంతుల్లో 13) వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా వీరిద్దరూ భారీ షాట్లతో జట్టు స్కోరును 150 పరుగులకు చేరువ చేశారు. చివర్లో వరుసగా వికెట్లు పడినా, భారత్ గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్ రెండు కీలక వికెట్లు పడగొట్టగా, రబేయా ఖాన్, నహిదా అక్తర్, మరుఫా అక్తర్ తలో వికెట్ తీశారు. ఫైనల్ చేరేందుకు 150 పరుగుల లక్ష్యంతో బంగ్లాదేశ్ మరికాసేపట్లో బ్యాటింగ్ ప్రారంభించనుంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ‘ఎపిక్’ దాదాపు నా జీవిత కథే.. కానీ ఆ ఒక్కటి జరగలేదు: ఆనంద్ దేవరకొండ

ఒక్కటి తప్ప ‘ఎపిక్’ సినిమా కథ నా జీవితంలో జరిగిందన్న ఆనంద్ దేవరకొండ

అన్న విజయ్, వదిన రష్మిక తనకు అండగా ఉంటారని వెల్లడి

‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడిగా నటించనున్నట్టు ప్రకటన



యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్’. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆనంద్ దేవరకొండ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సినిమా దాదాపు తన జీవిత కథేనని, కేవలం ఒక్క విషయం మినహా మిగతావన్నీ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలేనని ఆయన వెల్లడించారు. “నేను ఒక బాధ్యత గల నటుడిని. నేను ఎంచుకునే కథలు కూడా అదే రీతిలో ఉంటాయి. ఈ సినిమా వాస్తవ జీవితానికి అద్దం పడుతుంది. ప్రేమ, కుటుంబం, బాధ్యతలు వంటి అంశాల మేళవింపుగా సాగే ఈ చిత్రం హీరో-విలన్ల మధ్య నడిచే కథ కాదు.. ఇదొక అందమైన ప్రయాణం,” అని ఆయన పేర్కొన్నారు. తాను అమెరికాలో చదువుకున్నప్పటి అనుభవాలకు, లండన్ నేపథ్యంలో సాగే ఈ కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయని తెలిపారు. “విదేశాల్లో కుటుంబానికి దూరంగా ఉంటూ, ఆర్థిక సమస్యలను అధిగమించి స్థిరపడాలనుకునే ఎంతోమంది యువతకు ఈ కథ కనెక్ట్ అవుతుంది. సినిమాలో హీరో ఓ అమ్మాయితో కలిసి నివసిస్తాడు. నా నిజ జీవితంలో ఆ ఒక్కటి మినహా, మిగిలినదంతా నా కథే” అని ఆనంద్ వివరించారు. లివ్-ఇన్ రిలేషన్‌షిప్ నేపథ్యం ఉన్నప్పటికీ, దర్శకుడు ఆదిత్య హాసన్ ఎక్కడా ఇబ్బందికరంగా లేకుండా, కుటుంబ ప్రేక్షకులు సైతం వీక్షించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారని ఆయన భరోసా ఇచ్చారు. సాధారణంగా ఇంట్లో సినిమా విషయాలు పెద్దగా చర్చించుకోమని, అయితే తన సోదరుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తనకు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. ఇటీవల తనకు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాకు వారు వాచీలను బహుమతిగా ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను ‘తక్షకుడు’ అనే మిస్టికల్ థ్రిల్లర్‌లో అంధుడి పాత్రలో నటిస్తున్నానని, అలాగే మరో ఇండో-కొరియన్ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉందని తన భవిష్యత్ చిత్రాల గురించి వెల్లడించారు.

## ‘ది ప్యారడైజ్’ చిత్రీకరణ పూర్తి.. నాని కొత్త పోస్టర్ రిలీజ్!

నేచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ షూటింగ్ పూర్తి చేసుకుంది. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర యూనిట్ సినిమా మొత్తం చిత్రీకరణను విజయవంతంగా ముగించినట్లు సమాచారం. ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. అంతకంటే ఒకరోజు ముందుగా, అంటే సెప్టెంబర్ 23న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. గురువారం చిత్ర యూనిట్ నానికి సంబంధించిన ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ పోస్టర్‌లో నాని పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో పీరియడ్ రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నారు. చేతిలో భారీ తుపాకీ పట్టుకుని, తీవ్రమైన చూపులతో ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన మొబైల్ ఫోన్ నుంచి తీసిన స్క్రీన్‌షాట్‌ను పోస్టర్‌గా విడుదల చేసినట్టు తెలుస్తోంది.ఇప్పటికే విడుదలైన ‘ది ప్యారడైజ్’ టీజర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. పీడిత ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ స్పష్టం చేసింది. “ఇకపై ఈ నేల ఎవరిది?”, “అసహ్యించుకున్న నలుపే మా జెండా.. కాకి మా చిహ్నం” వంటి సంభాషణలు, రక్తపాతంతో కూడిన యాక్షన్ సన్నివేశాలు సినిమా ఎంత తీవ్రంగా ఉండబోతోందో సూచించాయి. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఈ సినిమాను మొదట మార్చి 26న, ఆ తర్వాత ఆగస్టు 21న విడుదల చేయాలని భావించినప్పటికీ, పలు కారణాలతో సెప్టెంబర్ 24కి వాయిదా పడింది. ఎట్టకేలకు షూటింగ్ పూర్తి కావడంతో, ఇక ప్రమోషన్ల జోరు పెంచి సినిమాను ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు యూనిట్ సిద్ధమవుతోంది.





## ఆడవాళ్ల సినిమా.. రూమ్‌లో అందరూ పురుషులే!: ఇండస్ట్రీ తీరుపై ‘దంగల్’ నటి ఆవేదన

సినీ పరిశ్రమలో పితృస్వామ్యంపై దంగల్ నటి ఫాతిమా సనా షేక్ వ్యాఖ్యలు

పురుషాధిక్యతకు పురుషులతో పాటు మహిళలు కూడా కారణమేనన్న ఫాతిమా

మహిళా సాధికారత కథల చర్చల్లో ఒక్క మహిళ కూడా ఉండరని వెల్లడి

ప్రతి మహిళా తన కోసం తాను పోరాడాలని పిలుపు

‘హుంకార్’ వెబ్ సిరీస్‌లో పోలీస్ అధికారిగా కనిపించనున్న నటి

‘దంగల్’ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్, సినీ పరిశ్రమలో వేళ్లూనుకుపోయిన పితృస్వామ్యం, లింగ వివక్షపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తాజా వెబ్ సిరీస్ “హుంకార్-ది రోర్” ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమలో మహిళలు తమ గొంతు వినిపించడానికి ఎంతగా పోరాడాల్సి వస్తుందో వివరించారు.పితృస్వామ్య ధోరణులకు కేవలం పురుషులను నిందించడం సరికాదని, ఈ వ్యవస్థలో మహిళలు కూడా భాగమేనని ఫాతిమా స్పష్టం చేశారు. “ఈ పితృస్వామ్యం పురుషుల తప్పు మాత్రమే కాదు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. మనందరం ఒకే రకమైన సామాజిక వాతావరణంలో పుట్టి పెరుగుతాం. అందుకే అది మనలో అంతర్లీనంగా పాతుకుపోయింది. దీనిపై మనమంతా పోరాడాలి” అని ఆమె అన్నారు.పరిశ్రమలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఫాతిమా పంచుకున్నారు. మహిళా సాధికారతకు సంబంధించిన కథల చర్చలకు పిలిచినప్పుడు, ఆ గదిలో తాను తప్ప మరో మహిళ ఉండేది కాదని గుర్తుచేసుకున్నారు. “నిర్మాత వచ్చి ఇది మీకోసం అద్భుతమైన సినిమా అంటారు. మహిళ తన గొంతును వెతుక్కునే పాత్ర అని చెబుతారు. కానీ ఆ గదిలో నిర్మాత, దర్శకుడు, రచయిత అంతా మగాళ్లే ఉంటారు” అని ఆమె వివరించారు. అలాంటి సందర్భాల్లో తాను ఏదైనా సూచన ఇవ్వబోతే, వారు దాన్ని తీసుకోలేరని, వింత జోకులు వేస్తారని, మహిళల భావాలు ఎలా ఉంటాయో తమకే వివరిస్తారని (మాన్‌స్ప్లెయిన్) ఆవేదన వ్యక్తం చేశారు. హింసాత్మక ఘటనల విషయంలో కూడా మహిళల ఫీలింగ్స్ గురించి పురుషులే పాఠాలు చెబుతారని, అది పెద్ద విషయం కాదన్నట్టు మాట్లాడతారని ఆమె పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రతి మహిళా తన కోసం తాను నిలబడటం, పోరాడటం నేర్చుకోవాలని ఫాతిమా పిలుపునిచ్చారు. ఇక ఆమె నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ ‘హుంకార్-ది రోర్’ విషయానికొస్తే.. ఇది ఒక కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో ఫాతిమా నిజాయతీ గల పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ సిరీస్‌ను ప్రియాంక చోప్రాకు చెందిన పర్పుల్ పెబుల్ పిక్చర్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, బిర్లా స్టూడియోస్, మంగత ఫిల్మ్స్ ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మించాయి. కరణ్ డి. కపాడియా, నిత్యా మెహ్రా దర్శకత్వం వహించిన ఈ సిరీస్, సెప్టెంబర్ 25 నుంచి ‘జియోహాట్‌స్టార్’ (జీఅశీఎశోఖీ)లో స్ట్రీమింగ్ కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com